www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 29 సెప్టెంబరు 2025

బీచ్‌లో పర్యాటకులు

సాగరతీరం.. కోలాహలం

మొగల్తూరు : మండలంలోని పేరుపాలెం సౌత్, కేపీ పాలెం సౌత్ గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఉత్సాహంగా కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటలలో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

వైరస్‌ల ధాటికి

రొయ్య రైతు విలవిల

ప్రజాశక్తి - భీమవరం

వేండ్ర గ్రామానికి చెందిన ఒక రైతు మూడెకరాల్లో ఆక్వా సాగు చేపట్టి సీడ్ వేశారు. నెల రోజులు గడవక ముందే చెరువుకు వైరస్ సోకింది. రొయ్యలు నీటిపై తేలడం చూసిన రైతు పట్టుబడి పట్టేశారు. ఎకరానికి రూ.2.50 లక్షల చొప్పున రూ.7.50 లక్షలు నష్టం వాటిల్లింది. ఇక చేసేదేమీ లేక సాగు చేయకుండా వదిలేశారు.

మోగల్లుకు చెందిన మరో రైతు మూడున్నర ఎకరాల్లో సాగు చేయగా వైట్‌స్పాట్ వైరస్ సోకి చెరువులోని రొయ్యలు రాత్రికి రాత్రి పెద్దసంఖ్యలో తేలిపోయాయి. చెరువు దగ్గరకు ఉదయం వెళ్లి చూసిన రైతు బరువెక్కిన గుండెతో కంటతడి పెట్టుకున్నాడు. కేవలం సీడ్ వేసిన 40 రోజుల్లోనే ఇలా జరగడంతో చేసేదేమీ లేక పట్టుబడి పట్టాల్సి వచ్చింది. సుమారు రూ.10 లక్షల వరకు నష్టపోయాడు. ఇక సాగు చేయకూడదని నిర్ణయించుకుని చెరువు ఖాళీగా వదిలేశారు.

పెన్నాడ అగ్రహారానికి చెందిన ఇంకో రైతు రెండెకరాల్లో సాగు చేపట్టి 60 రోజులు గడిచాక పంట బాగుందని ఆనందంగా ఉన్న సమయంలో ఉన్నట్టుండి రాత్రికి రాత్రి చెరువు మొత్తం వైరస్ ధాటికి తిరగబడింది. మరో 25 రోజుల్లో పంట చేతికొచ్చే సమయానికి రొయ్యలు మృత్యువాత పడటంతో సుమారు రూ.8 లక్షల వరకు నష్టం వాటిల్లడంతో కన్నీరు మున్నీరయ్యాడు.

జిల్లాలో ఒకప్పుడు డాలర్ పంటగా పిలవబడే ఆక్వా సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఒకపక్క నాణ్యమైన సీడ్ లభించకపోవడం, ఫీడ్ ధరలు అధికంగా ఉండటం, విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచడం వంటి సమస్యలతో సతమతమవుతున్న ఆక్వా రైతాంగానికి ఊహించని రీతిలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల దాడితో పరిస్థితి తలకిందులైంది. ఈ నేపథ్యంలోనే ఆక్వా చెరువులపై వైరస్ దాడి ప్రారంభించింది. దీంతో ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. దీనిలో సుమారు 1.10 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. దీనిపై వేలాది మంది ఆక్వా రైతులు, ఆక్వా అనుబంధ పరిశ్రమల కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఆక్వా సాగుకు గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. ఆక్వా చెరువులపై వివిధ రకాల వైరస్‌లు దాడి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాటిని అడ్డుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. అయినా పరిస్థితులు అదుపులోకి వచ్చే పరిస్థితి కనిపించట్లేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఆక్వా చెరువులను విబ్రో, వైట్ స్పాట్ వైరస్ చుట్టుముట్టాయి. దీనికి తోడు ఫీడ్ అధికంగా వినియోగించడం, సీడ్ నాణ్యత లేకపోవడం, వాతావరణ మార్పులు, సాగుకు సాగుకు మధ్య సమయం ఇవ్వకపోవడం, చెరువులకు మురుగు బోదె లేకపోవడం వంటి వాటి వల్ల కూడా వైరస్ సమస్య మరింత పెరుగుతోంది. సాగుకు సాగుకు మధ్య కనీసం నెల రోజులు గడువు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ రైతులు పట్టుబడి పట్టిన వెంటనే మళ్లీ సీడ్ వేయడంతో వైరస్ ప్రబలుతోంది. సాధారణంగా ఒక ఎకరానికి 90 వేల నుంచి లక్ష వరకు రొయ్య పిల్లలు వేయాల్సి ఉంది. అయితే కొంతమంది రైతులు లక్షా 50 వేల నుంచి రెండు లక్షలు, మూడు లక్షలు వరకూ రొయ్య పిల్లలు వేస్తున్నారు. ఇలా చేయడం వల్ల కూడా వైరస్ సోకుతుందని కొంతమంది రైతులు చెబుతున్నారు. ప్రధానంగా వైట్ కట్ , విబ్రో వైరస్‌లు ఆక్వా చెరువులను చుట్టుముట్టాయి. పక్షులు, పాములు, కప్పలు, కుక్కల ద్వారా చెరువులకు ఈ వైరస్ సోకుతోంది. చివరకు గాలి ద్వారా కూడా ఒక చెరువు నుంచి మరో చెరువుకు వైరస్ సోకుతుండటంతో రైతులు అర్ధాంతరంగా చెరువులు పట్టుబడులు పట్టి అయినకాడికి అమ్ముకుంటున్నారు. నెల రోజుల్లో వైరస్ ప్రభావంతో 70 శాతం చెరువులు ఖాళీ అయ్యాయి. రైతులు సాగు చేయకుండా అలాగే వదిలేశారు. ఈ నేపథ్యంలో సాగు చేయాలా.. వద్దా అనే సందిగ్ధ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

సాగు వాయిదా దిశగా రైతులు

పాలకోడేరు మండలంలో వేండ్ర, మోగల్లు, కొండేపూడి, పెన్నాడ అగ్రహారం, శృంగవృక్షం గ్రామాల్లోని ఆక్వా చెరువులు వైరస్ ప్రభావానికి గురయ్యాయి. దీంతో అయినకాడికి పట్టుబడులు పట్టి ఎకరానికి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు తీవ్రంగా నష్టపోయారు. దీంతో సాగు చేయకుండా చెరువులను ఖాళీగా ఉంచారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలోని రైతులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఆక్వా సాగును కొన్ని రోజులపాటు వాయిదా వేసేందుకు నిర్ణయించుకున్నారు. వైరస్ ప్రభావం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆక్వా రైతులు చెబుతున్నారు.

అయినకాడికి రైతులు పట్టుబడి
ఎకరాకు రూ.2 లక్షల నుంచి
రూ.5 లక్షల వరకు నష్టం
నెల రోజుల వ్యవధిలో
70 శాతం చెరువులు ఖాళీ
దిక్కుతోచని స్థితిలో ఆక్వా రైతులు

రొయ్యలకు మద్దతు ధర ప్రకటించాలి

పాలా శ్రీనివాసరావు, ఆక్వా రైతు, వేండ్ర



నేను రెండున్నర ఎకరాల్లో సాగు చేస్తున్నాను. మా ప్రాంత ఆయకట్టు వైరస్ ప్రభావానికి గురవ్వడంతో పట్టుబడి ముందుగానే పట్టేశాను. నాణ్యమైన సీడ్ దొరకడం లేదు. ఫీడ్ ధరలు అధికంగా ఉన్నాయి. ధరల్లో నియంత్రణ కూడా లేదు. పట్టుబడులు ఎక్కువ ఉన్నప్పుడు ధరలను అమాంతం తగ్గించేస్తున్నారు. దీనివల్ల తీవ్రంగా నష్టపోతున్నాం. రొయ్యలకు కనీస మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వం ఆదుకోవాలి.

45 రోజుల్లోనే పట్టుబడి పట్టేశాను

కడలి మణికంఠ, ఆక్వా రైతు, వేండ్ర

మూడున్నర ఎకరాల్లో సాగు చేస్తున్నాను. సాధారణంగా పంట చేతికి రావాలంటే 90 రోజులు సమయం పడుతుంది. అయితే ప్రస్తుతం వైట్‌కట్, విబ్రో వైరస్‌లు చెరువులను చుట్టుముట్టడంతో సీడ్ వేసిన 45 రోజుల్లోనే పట్టుబడి పట్టేశాను. ప్రస్తుతం ట్రంప్ విధించిన సుంకాలతో ధరలు తగ్గిపోయాయి. ఒకపక్క వైరస్ ప్రభావం, మరోపక్క ధరలు తగ్గిపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

గోదావరికి వరద ఉధృతి

ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో లంకవాసుల్లో ఆందోళన నెలకొంది. వరద నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ జి.కనకరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం కోడేరు వద్ద గోదావరి నీటిమట్టం మూడు అడుగులు మేర పెరిగింది. ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు సముద్రంలోకి వదులుతున్న నేపథ్యంలో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. రెండు రోజులు వరద ఉధృతి ఇలానే కొనసాగితే లంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు నీట మునిగే అవకాశం ఉంది. పుష్కర ఘాట్ల ఎవరూ గోదావరిలోకి దిగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ కె.వెంకటరమణ తెలిపారు.

యలమంచిలి: కనకాయలంక కాజ్‌వే వద్ద పడవపై రాకపోకలు

నరసాపురం: నిలిచిన పంటు రాకపోకలు

వరద నీటిలో కనకాయలంక కాజ్‌వే

యలమంచిలి: గోదావరికి వరద తాకిడితో కనకాయలంక కాజ్‌వే నీట మునిగింది. దీంతో ఆ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. దీంతో అక్కడి ప్రజలు నిత్యావసరాల నిమిత్తం మర పడవల్లో రాకపోకలను సాగిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది స్థానిక ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ దగ్గరుండి పడవల్లో ప్రజల రాకపోకలను పర్యవేక్షిస్తున్నారు. తమ గ్రామానికి తాగునీరు, నిత్యావసరాలు పంపిణీ చేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

నిలిచిన పంటు

నరసాపురం: వశిష్ట గోదావరి వరద ఉధృతి పెరగడంతో నరసాపురం-సఖినేటిపల్లి రేవు మధ్య పంటు, పడవల రాకపోకలను ఆదివారం నుంచి పూర్తిగా నిలిపివేశారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి తొమ్మిది లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో వరద ఉధృతి ఎక్కువగా ఉందని, దీంతో పంటు, పడవల రాకపోకలను నిలిపివేసినట్లు తహశీల్దార్ ఐవివి సత్యనారాయణ తెలిపారు. ప్రజలు గమనించి చించినాడ బ్రిడ్జిపై నుండి రాకపోకలు సాగించాలని సూచించారు. పండుగ సీజన్, ఆదివారం కావడంతో పంటు సౌకర్యం లేక ఇరువైపుల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పట్టాల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

అభ్యంతరం లేని పోరంబోకు భూముల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల పట్టాల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గొల్లవానితిప్పలో ఆయన ఆదివారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి అభ్యంతరాలు లేని పోరంబోకు భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అభ్యంతరాలు లేని ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్ను, కరెంటు బిల్లు, రశీదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒ ఎంఎస్ నెంబర్.30 ప్రకారం 2019కు ముందు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. లబ్ధిదారులు ఇంకా ఎవరైనా ఉంటే వివరాలు సేకరించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, మండల సర్వేయర్, విఆర్‌ఒ, సిబ్బంది ఉన్నారు.

నివాసితులతో మాట్లాడుతున్న జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి

పిహెచ్‌సి వైద్యుల పోరుబాట

సమస్యల పరిష్కారం కోసం సమ్మెలోకి
ప్రభుత్వం హామీలను అమలు చేయకపోవడంపై ఆగ్రహం
ఇన్‌సర్వీస్ పీజీ కోటా నుంచి అనేక సమస్యలు పెండింగ్
ఏజెన్సీ పిహెచ్‌సిల్లో వైద్యులకు అందని అలవెన్స్
రెండు జిల్లాల్లో 240 మందికిపైగా పిహెచ్‌సి వైద్యులు
నేడు అన్ని పిహెచ్‌సిల్లోనూ ఓపి సేవలు నిలుపుదల

పిజి ఇన్‌సర్వీస్ కోటా తగ్గింపుపై గత ఏడాది ఏలూరు డిఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఆందోళన చేసిన పిహెచ్‌సి వైద్యులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పిహెచ్‌సి వైద్యుల పట్ల ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు వైద్యం అందించే వైద్యుల సమస్యలపై ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. పేదలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వైద్యం అందించే వైద్యుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోంది. దీంతో తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సి) వైద్యులు పోరుబాట పట్టారు. దీర్ఘకాలంగా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్న సమస్యల పరిష్కారం కోసం పిహెచ్‌సి వైద్యులంతా సమ్మెకు దిగారు. డిఎంహెచ్‌ఒ, జిల్లా కలెక్టర్‌కు సమ్మె నోటీసు ఇచ్చి ముందుకు సాగుతున్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి రెండు జిల్లాల్లోని పిహెచ్‌సిల వైద్యులు ఆందోళన సాగిస్తున్నారు. ఆన్‌లైన్ రిపోర్టింగ్, 104 సేవలు నిలుపుదల, జిల్లా అధికారుల గ్రూపుల నుంచి బయటికి రావడం వంటి కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టగా సోమవారం అన్ని పిహెచ్‌సిల్లోనూ ఎమర్జెన్సీ సేవలు మినహా మిగిలిన ఓపి సేవలను బహిష్కరించే కార్యక్రమానికి పిలుపునిచ్చారు. తర్వాత ఏలూరు, విజయవాడలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఏలూరు జిల్లాలో 62 పిహెచ్‌సిలు ఉండగా 110 పది మందికిపైగా వైద్యులు ఉన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 41 పిహెచ్‌సిలు ఉండగా దాదాపు 80 మందికిపైగా వైద్యులు ఉన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నేపథ్యంలో గత్యంతరం లేని పరిస్థితుల్లో వారంతా సమ్మెకు దిగారు.

డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె

డాక్టర్ జి.గంగాభవాని,
ఎపి పిహెచ్‌సి వైద్యుల అసోసియేషన్ అధ్యక్షులు, ఏలూరు జిల్లా

పిహెచ్‌సి వైద్యుల సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుంది. జిల్లా కలెక్టర్, డిఎంహెచ్‌ఒకు ఇప్పటికే సమ్మెకు సంబంధించిన నోటీసులు ఇచ్చాం. ఓపి సేవల బహిష్కరణతోపాటు ఏలూరు, విజయవాడలో ఆందోళనా కార్యక్రమాలు కొనసాగుతాయి. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం.

పిహెచ్‌సి వైద్యుల డిమాండ్లు ఇవే..

పీజీ సీట్లలో పిహెచ్‌సి వైద్యులకు గతంలో 30 శాతం సీట్లు కేటాయించేవారు. గతేడాది 85 జిఒ తెచ్చి పీజీ సీట్లను ప్రభుత్వం 15 శాతానికి తగ్గించింది. దీంతో పిహెచ్‌సి వైద్యులంతా ఆందోళనబాట పట్టారు. దీంతో చర్చలు జరిపిన ప్రభుత్వం 20 శాతం కేటాయిస్తున్నట్లు పేర్కొంది. అంతేకాకుండా పిహెచ్‌సి వైద్యుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. అయితే ఇప్పటి వరకూ ఏ ఒక్క హామీనీ అమలు చేయకపోగా ఈ ఏడాది పీజీ సీట్లను మళ్లీ 15 శాతానికి తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది గ్రామీణ ప్రజలకు సేవలందిస్తున్న పిహెచ్‌సి వైద్యులకు అన్యాయం చేయడమేనని చెప్పొచ్చు. అంతేకాకుండా పిహెచ్‌సి వైద్యులుగా చేరిన వారికి ప్రమోషన్లు ఇవ్వకపోవడంతో ఉద్యోగ విరమణ వరకూ అదేవిధంగా ఉండిపోతున్నారు. దీంతో టైమ్‌బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని వారు కోరుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో పని చేసే పిహెచ్‌సి వైద్యులకు బేసిక్ పేపై 50 శాతం అలవెన్స్ ఇవ్వాలని వైద్యులు ఎప్పటి నుంచో అడుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నోషనల్ ఇంక్రిమెంట్ల మంజూరు, చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమం కింద వైద్యులకు రూ.ఐదు వేలు అలవెన్స్, నేటివిటీ, అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యల పరిష్కారంతోపాటు పిహెచ్‌సి వైద్యులకు కచ్చితమైన పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవులు, జాబ్‌చార్ట్, అనుకూలమైన పని వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని, అనధికార వ్యక్తులు పిహెచ్‌సిలను విచ్చలవిడిగా ఇన్‌స్పెక్షన్ చేయకుండా నిబంధనలు విధించాలని పిహెచ్‌సి వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే పిహెచ్‌సి వైద్యులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించకపోతే గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది.

కళ్లు ఆరోగ్యంగా ఉంటేనే ప్రపంచాన్ని చూడగలం

కంటి ఆసుపత్రి ప్రారంభోత్సవంలో మంత్రి నిమ్మల

మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

ఏ మనిషికైనా కళ్లు ఆరోగ్యంగా ఉంటేనే ప్రపంచాన్ని చూడగలమని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లులో ఆదివారం అమరావతి కంటి ఆసుపత్రిని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని అవయవాలలో కన్నుకు అత్యధిక ప్రాధాన్యత ఉందని చెప్పారు. అటువంటి కంటికి ఆధునిక వైద్యం కోసం పెద్ద నగరాలకు వెళ్లేవారని, ఇప్పుడు వెళ్లకుండా పాలకొల్లులోనే ఆధునిక సౌకర్యాలు ఉండటం హర్షణీయమన్నారు. మాజీ మంత్రి పీతల సుజాత మాట్లాడుతూ పాలకొల్లు ఆధునిక వైద్య సౌకర్యాల వల్ల పరిసర మండలాల ప్రజలకు ఎంతో లాభమన్నారు. ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు మాట్లాడుతూ కొత్తగా వస్తున్న ఆధునిక ఆసుపత్రులు సామాన్య ప్రజలను కూడా దృష్టిలో పెట్టుకుని వైద్యం చేయాలని అన్నారు. రైల్వే కమిటీ సభ్యులు జక్కంపూడి కుమార్ మాట్లాడుతూ కొన్ని రకాల ట్రీట్మెంట్‌లకు రూ.10 వేల నుంచి లక్ష వరకు ఫీజు చెల్లిస్తున్నారని దీనిపై వివరణ ఇవ్వాలని కోరారు. నాణ్యమైన వైద్య సౌకర్యాలు తక్కువ ధరకు వస్తే ఆసుపత్రి తక్కువ సమయంలోనే అభివృద్ధి చెందుతుందన్నారు. వైసిపి నేత యడ్ల తాతాజీ, జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవిందరాజు, ఛాంబర్ కార్యదర్శి కటారి నాగేంద్రకుమార్, ఛాంబర్స్ కళాశాల సెక్రటరీ కెవి.సీతారామరాజు, నన్నేటి పుష్పరాజు, తులా రామలింగేశ్వర రావు మాట్లాడారు. ఆసుపత్రి యాజమాన్యం తరుపున డాక్టర్ నాగెళ్ల వేణు, డాక్టర్ శైలజ స్వాగతం పలికారు.

ఘనంగా జాతీయ ర్యాబిస్ నివారణ దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం

ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

స్థానిక కలెక్టరేట్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ ర్యాబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది లూయిస్ పాశ్చర్ వర్ధంతి సందర్భంగా జాతీయ ర్యాబిస్ నివారణ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ర్యాబిస్ అనేది కుక్కలు, పిల్లులు, అడవి జంతువుల ద్వారా మనుషులకి వ్యాప్తి చెందుతుందన్నారు. ఇది ఒక ప్రమాదకరమైన వైరస్ అని, ఒకసారి వ్యాధి వస్తే చికిత్స లేకుండా ప్రాణాంతకరం అవుతుందన్నారు. అయితే ర్యాబిస్‌ని వంద శాతం నివారించవచ్చునని పేర్కొన్నారు. ర్యాబిస్ నివారణకి కుక్కలు, పిల్లులు, పెంపుడు జంతువులకు తప్పనిసరిగా ర్యాబిస్ వాక్సిన్ వేయించాలన్నారు. వీధి కుక్కల నుండి జాగ్రత్త వహించాలని, కుక్క కరిచినప్పుడు తక్షణమే గాయాన్ని సబ్బుతో శుభ్రం చేసి దగ్గర్లోని ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌ఒ డాక్టర్ ధనలక్ష్మి, జిల్లా ఎపిడెమయోలజిస్ట్ గాతల సుభాష్, పిఒఎన్, సిడిఅండ్‌ఆర్‌బిఎస్‌కె, ఎస్‌ఒఎంఎస్‌కె.ప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారి పి.సుకుమార్, భీమవరం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ బాబ్జీకి సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు



డాక్టర్ బాబ్జీతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

పుత్ర వియోగంతో బాధపడుతున్న మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ బాబ్జీని సిపిఎం నేతలు పరామర్శించారు. ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లిన నేతలు బాబ్జీ కుమారుడు డాక్టర్ అంజిబాబు గుండెపోటుతో మృతి చెండంపై సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అంజిబాబు చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, నేతలు చల్లా సోమేశ్వరరావు, టి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపకారాగారం ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలో..

ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి నరసాపురం ఉప కారాగారాన్ని ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్న వారికి అందించే వైద్య సదుపాయాలు ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. జైల్ ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. శిక్షపడిన ముద్దాయిలు ఉచిత న్యాయ సహాయం పొంది అప్పీల్‌కి వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. వంటశాల పరిశుభ్రతను, ఆహార పదార్థాలు రుచికరంగా ఉన్నాయని జైల్ సిబ్బందిని అభినందించారు. ప్రతీరోజు ఇదే విధంగా ఉంచాలని సూచించారు. జిల్లా జడ్జితో పాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి.అప్పారావు, జైల్ సిబ్బంది, ప్యానల్ న్యాయవాదులు కె.శిరీష, కె.చిట్టి పద్మజ, పిఎల్‌వి.శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

తణుకు : ఆర్థిక స్తోమత లేని ముద్దాయిలు, న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేకపోతే న్యాయసేవల కమిటీ తణుకు ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తారని ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి తెలియజేశారు. సోమవారం స్థానిక తణుకు సబ్ జైల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవల సంస్థ గుంటూరి వారి ఉత్తర్వుల మేరకు సబ్ జైల్ సందర్శించి రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న ఆహార, వసతి, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వాయిదాలకు కోర్టుకు తీసుకెళ్లని ముద్దాయిల కేసులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రవేశపెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా సెక్రటరీ కె.రత్నప్రసాద్, జైలు విజిటింగ్ న్యాయవాది ఎస్‌కె.మోతీ, పారా లీగల్ వాలంటీర్ కోనపల్లి అరుణ్‌బాబు, జైలు సూపరింటెండెంట్ జి.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్ నేటి యువతకు స్ఫూర్తిదాయకం

జయంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - తణుకు

తణుకులో నివాళులర్పిస్తున్న నేతలు

మూడు సంవత్సరాల వయస్సులో విప్లవ తుపాకీ మొక్కలు నాటిన విప్లవ బాలుడు, యువకిశోరం భగత్‌సింగ్ నేటి యువతకు స్ఫూర్తిదాయకమని భగత్‌సింగ్ యువజన సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులు సిద్ధాని శివగణపతి అన్నారు. సోమవారం మండలంలోని వేల్పూరులో భగత్‌సింగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో సర్దార్ భగత్‌సింగ్ 118వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివగణపతి మాట్లాడుతూ.. 1907లో పంజాబ్‌లో కిసాన్‌సింగ్, విద్యావతి దంపతులకు జన్మించిన భగత్‌సింగ్ 12 సంవత్సరాల వయస్సులోనే సామాజిక, ఆర్థిక, రాజకీయ ఆర్థిక అంశాలకు సంబంధించి వందకుపైగా పుస్తకాలు అధ్యయనం చేశాడంటే తన వయస్సు గల పిల్లల కంటే భగత్‌సింగ్ ప్రత్యేకమైన వ్యక్తి అని ఆయన కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం నేటి యువత ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బళ్ల చినవీరభద్రరావు, దున్నే రుద్రనాగేశ్వరరావు, మోటుపల్లి తరుణ్, విశ్వనాథం శివ, తిప్పా త్రినధ్, తాడిశెట్టి స్వామి, పొన్నకోటి కిరణ్, విశ్వనాథం సురేష్, అంగాని రామచంద్రవర్మ, చల్లా కిషోర్, వద్ది మహేష్ పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో బండి ముత్యాలమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విప్లవ వీరుడు భగత్‌సింగ్ జయంతిని ఆరోగ్య వర్షిణీ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు, గ్రామస్తులు కామని హరి, దొంగ శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

మీకోసం కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలి

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్ నిర్వహణ

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పిజిఆర్ఎస్‌ను సోమవారం కలెక్టరేట్‌లో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా సమర్పించు కోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్వరలోనే రెండు ఫ్రీజర్ల ఏర్పాటు

డాక్టర్ గాదిరాజు రంగరాజు

ప్రజాశక్తి - ఉండి

ఉండి మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు 7 ఫ్రీజర్లు ఉన్నాయని, మరో రెండు ఫ్రీజర్లను త్వరలోనే ఏర్పాటు చేసి అవసరమైన వారికి అందుబాటులోకి తీసుకొస్తామని ఉండి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దపుల్లేరు గ్రామంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ సంస్థ తరఫున మండలంలో ఉన్న ఏడు ఫ్రీజర్లను ప్రజల అవసరాలకు అందుబాటులో ఉంచామని, కానీ మరో రెండు ఫ్రీజర్లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వెంటనే వాటిని ఏర్పాటు చేయాలన్నారు. సంస్థ తరఫున ఒక శాంతి రథం కూడా ఏర్పాటు చేసి నిరుపేదలకు అందుబాటులో ఉంచాలని సమావేశంలో తీర్మానించినట్లు రంగరాజు వివరించారు. ఆకివీడు మండలంలో నూతనంగా మానవతా సంస్థ ఏర్పాటుచేసి ఆకివీడు ప్రజలకు సేవలందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు దంగేటి రామలింగేశ్వరరావు, పరంశెట్టి ఆంజనేయులు, కొమ్మన నాగబాబు, రాయి రావులమ్మ, యర్రా విక్రం, మడిచర్ల సూర్య ప్రకాష్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా

ప్రజాశక్తి - తణుకు

తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 29వ తేదీ నుండి తలపెట్టిన సమ్మె అధికారుల హామీ మేరకు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఎపి మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షులు కోనాల భీమారావు తెలియజేశారు. ఆదివారం తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి ఆవరణలో భీమారావు కార్మికులను కలిసి మాట్లాడుతూ.. ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డిసిహెచ్ఎస్.సూర్యనారాణ కార్మికుల సమస్యలు అక్టోబరు 1వ తేదీ నాటికి పరిష్కారం చేస్తామని, అప్పటి వరకు గడువు కావాలని కోరారని తెలిపారు. దీంతో ఈనెల 29 నుండి తలపెట్టిన సమ్మె కార్మికులతో చర్చించి తాత్కాలికంగా వాయిదా వేసినట్లు భీమారావు తెలిపారు. కార్మికుల నాలుగు నెలల వేతన బకాయిలు, 40 నెలల పిఎఫ్ బకాయిలు చెల్లించాలని, తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి 150 పడకల స్థాయికనుగుణంగా కనీసం 60 మంది పారిశుధ్య కార్మికులను నియమించాలనే డిమాండ్స్ పరిష్కారం కోరుతూ సమ్మె నోటీసు ఇచ్చినట్లు భీమారావు తెలిపారు. అధికారులు ఇచ్చిన గడువులోగా కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే అక్టోబర్ 2వ తేదీ నుండి సమ్మెలోకి వెళ్లనున్నట్లు భీమారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్మాని పుష్పలత, మార్లపూడి వెంకటలక్ష్మి, పొలుకొండ విజయలక్ష్మి, సిహెచ్.మంగమ్మ, వి.సూరమ్మ, ఎం.బేబి, ఉల్లంపర్తి లక్ష్మి, ఎన్.చింతాలు, డి.లక్ష్మణరావు, ఎం.శ్రీను, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుతో పేదలకు ఊరట : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - తణుకు

జిఎస్‌టి తగ్గింపుతో ప్రతి కుటుంబానికి ఇకపై ప్రతినెలా ఆదాయం ఆదా అవుతుందని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిఎస్‌టి 2.0 కింద ప్రజలకు కలిగే లబ్ధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. నిత్యావసర వస్తువులపై 18 నుంచి 5 శాతానికి తగ్గించడం లేదా మినహాయించడం ద్వారా పేదలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజలు వినియోగించే నిత్యావసర సరుకులపై జిఎస్‌టి తగ్గింపుతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన వస్తువులపై విద్యా, పారిశ్రామిక సంబంధమైన వస్తువులు, ద్విచక్ర కార్లు వంటి వాహనాలపై జిఎస్‌టి తగ్గడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మరోవైపు నిత్యావసర వస్తువులు పుస్తకాలు, స్టేషనరీ, ఔషధాలు, ఆరోగ్య బీమా ప్రీమియం వంటి వాటిపై జిఎస్‌టి తగ్గించడంతో మధ్యతరగతి ప్రజలకు ఊరట కలుగుతోందన్నారు.

ఘనంగా గుర్రం జాషువా, భగత్ సింగ్ జయంతి

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో నివాళులర్పిస్తున్న నేతలు

స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక, సాహితీ స్రవంతి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో విశ్వనరుడు, కవికోకిల, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతి, షాహిద్ భగత్ సింగ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న నేతలు జాషువా కవిత్వం, భగత్ సింగ్ పోరాట పటిమపై మాట, పాట, కవిత్వం ద్వారా తమ అభిప్రాయాలను వెల్లడించారు. కుల వివక్షత అంతరించాలని, విశ్వమానవ సౌభ్రాతృత్వం వర్ధిల్లాలని వక్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జె.రామలక్ష్మణరావు, ప్రధానకార్యదర్శి మల్లుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చింతపల్లి ప్రసాదరావు, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు చైతన్య ప్రసాద్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి షేక్ వలీ, జిల్లా సీనియర్ నాయకుడు వై.అజయకుమార్, యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు పట్టాభిరామయ్య, కెవిపిఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.క్రాంతిబాబు, సిఐటియు నాయకులు జి.రామకృష్ణ, ఐ.శ్రీనివాస్, నాయకులు మాధవీలత, జి.సుకుమార్, డి.సత్యనారాయణ, పి.ఫణిరాజేష్, ఎ.జాన్సన్, తెలుగు పండితులు విజయకుమార్ పాల్గొన్నారు.

నరసాపురం : ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో తెలుగు కవి కోకిల, నవయుగ కవి చక్రవర్తి శ్రీగుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి రిటైర్డ్ తెలుగు పండిట్ కృష్ణవేణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ.. తదనంతరం జాషువా రచించిన పద్యాలు మీద పోటీ నిర్వహించారు. ఈ పోటీలో ప్రథమ బహుమతి అడబాల హర్షిత 163 పద్యాలు, ద్వితీయ బహుమతి సవరం హేంశ్రీ చందన, తృతీయ బహుమతి కనుమూరి అగస్త్య అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సుధీర్ మోహన్, కృష్ణారంతం, అడబాల శ్రీరామ్, జీవన్ కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన హిందీ పక్షోత్సవాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక శ్రీఅద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ భాష పక్షోత్సవాలు ముగింపు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ వి.వి.మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.మురళీకృష్ణ, ముఖ్య అతిథులుగా శ్రీదిబ్బా ఇంద్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల తణుకు హిందీ అధ్యాపకులు ఎస్.సుజాత, నారాయణ స్కూల్ హిందీ పండిట్ షేక్ బాదర్ బాబు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ హిందీ భాష ప్రాముఖ్యత, ఆవశ్యకతను తెలియజేశారు. కె.మురళీకృష్ణ మాట్లాడుతూ భారత జాతీయ ఉద్యమంలో హిందీ ప్రధాన పాత్ర పోషించిందని, దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లినా హిందీ భాష మాట్లాడగలిగితే ఉండే సులువును వివరిస్తూ హిందీ నేర్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి సుజాత మాట్లాడుతూ తాను హిందీ భాష పట్ల మక్కువ చూపటానికి గురువు రమణ కుమార్ ఎంతో ప్రోత్సహించారని, అందువల్లనే తాను హిందీ భాషలో ఉద్యోగం సాధించగలిగానని పేర్కొన్నారు. షేక్ బాదర్ బాబు మాట్లాడుతూ తాను ఇదే కళాశాలలో చదువుకున్నానని, హిందీ సార్ రమణ కుమార్ ప్రోత్సాహంతో తాను ఎలిజి సెట్ రాసి, శిక్షణ పొంది ప్రస్తుతం నారాయణ స్కూల్లో పనిచేస్తున్నానని పేర్కొన్నారు. హిందీ అధ్యాపకులు రమణ కుమార్ మాట్లాడుతూ వివిధ హిందీ భాష దినోత్సవాలు నిర్వహించి, విద్యార్థులకు బహుమతులను అందజేయటం, పట్టణానికి చెందిన హిందీ అధ్యాపకులను సన్మానించడం చేసేవాడినని, ఈ సంవత్సరం అందుకు భిన్నంగా తన వద్ద విద్యాభ్యాసం చేసిన హిందీ బోధకుల రంగంలో స్థిరపడిన శిష్యులను సన్మానించానని పేర్కొన్నారు. తద్వారా భవితకు ఒక ప్రేరణగా ఉంటుందని సన్మానించానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, హిందీ అధ్యాపకులు ఎస్.ఎస్.రమణ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99180
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థులు అర్హులు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రతిభ గల పేద, మధ్యతరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాలను అందిస్తోంది. ఇందుకు ఏటా నేషనల్ మీన్స్‌కు మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పేరిట పరీక్ష నిర్వహిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. రాతపరీక్షలో ఎంపికైన వారికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏటా రూ.12 వేలు చొప్పున మొత్తం రూ.48 వేలు అందజేస్తారు. అయితే ఇంటర్ తప్పనిసరిగా ప్రభుత్వ కళాశాల లోనే చదవాలి. ప్రభుత్వ హాస్టల్లో ఉండకూడదు. డే స్కాలర్‌గా ఉండాలి.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

రేపటి వరకూ అవకాశం..

ఎన్ఎంఎంఎస్‌కు సంబంధించి ఈ విద్యాసంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. పరీక్ష నిమిత్తం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 30వ తేదీ వరకు గడువు విధించింది. రాష్ట్ర విద్యాశాఖ సహకారంతో 2008 నుంచి ఏటా ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. www.bse.ap.gov.in వెబ్ సైట్ పాఠశాల డైస్‌కోడ్ ద్వారా లాగిన్ అయి విద్యార్థి పూర్తి వివరాలను ఉపాధ్యాయుడి సమక్షంలో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఒసి, బిసి విద్యార్థులు రూ.100, ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాలి.

అర్హతలు ఇవే..

ప్రస్తుతం ప్రభుత్వ జిల్లాపరిషత్, మున్సిపల్, ప్రభుత్వ ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు వసతి సౌకర్యం లేని ఎపి ఆదర్శ(మోడల్) పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. 7వ తరగతిలో ఒసి, బిసి విద్యార్థులు 55 శాతం, ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగ విద్యార్థులు 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఏడోతరగతి ఉత్తీర్ణత పత్రాలు సమర్పించాలి.

విద్యార్థులు పరీక్షకు నమోదు చేసుకోవాలి

బుద్ధరాజు సూర్య కుమారి, హెచ్ఎం, నిప్పులేటి హైమావతి బాబ్జి మున్సిపల్ హై స్కూల్, చినమామిడి పల్లి

మా పాఠశాలలో ప్రస్తుతం 7 మంది ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసి ఉపకార వేతనాలు అందుకుంటున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 30 మందికిపైగా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేశాం. వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి శిక్షణ ఇస్తున్నాము.

గుండెపోటుతో రిటైర్డ్ ఎస్ఐ వెంకట సత్యనారాయణ మృతి

ప్రజాశక్తి - యలమంచిలి

ఎఆర్‌లో ఎస్ఐగా పనిచేస్తూ స్వచ్ఛంద విరమణ పొందిన మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన కేతా వెంకట సత్యనారాయణ(సత్తిపండు(57)) శనివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య ప్రమీల, కుమార్తె భార్గవి, కుమారుడు వెంకట అజయ్(కానిస్టేబుల్) ఉన్నారు. వీరి కుటుంబం ఉద్యోగరీత్యా పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామంలో స్థిరపడ్డారు. వెంకట సత్యనారాయణ స్వయంగా చించినాడ సిపిఎం సీనియర్ నేత, మాజీ గ్రామ సర్పంచి, మాజీ సొసైటీ అధ్యక్షులు కేతా సూర్యారావు తమ్ముడు నాగేశ్వరరావు కుమారుడు. వెంకట సత్యనారాయణ చిన్నతనంలోనే వారి తల్లిదండ్రులతో కలిసి 1977-80 మధ్యకాలంలో చించినాడ గ్రామంలో పేదలకు, భూస్వాములకు జరిగిన సమరశీల పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం

చించినాడలో విషాద ఛాయలు

నాయకునిగా బాధ్యతలు నిర్వహిస్తూ.. ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొంది అంచెలంచెలుగా ఎదిగారు. అప్పటి మంత్రులు కొత్తపల్లి సుబ్బారాయుడు, దాసరి నారాయణరావు దగ్గర సుదీర్ఘకాలం పాటు గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ.. అనంతరం ఎఆర్ లో ఎస్ఐగా పనిచేస్తున్నారు. కొంతకాలం కిందట స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ పొందారు. సత్యనారాయణ చదువుకునే వయసులో వాలీబాల్, కబడ్డీ క్రీడాకారునిగా జిల్లాలోనే మంచి గుర్తింపు పొందిన చాలామందికి సుపరిచితుడు. ఈ నేపథ్యంలో ఆయన మృతిచెందడంతో చించినాడ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

వెంకటసత్యనారాయణ(ఫైల్)

ప్రముఖుల సంతాపం

రిటైర్డ్ ఎస్ఐ కేతా వెంకట సత్యనారాయణ మృతిపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, కేతా గోపాలం, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, మండల కార్యదర్శి కానేటి బాలరాజు తదితరులు సంతాపం, సానుభూతిని తెలిపారు.

దొంగల ముఠాపై అప్రమత్తంగా ఉండాలి

డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద

నరసాపురం : మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకి చెందిన ఆరుగురి ముఠా రాబరీ గ్యాంగ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద ప్రజలను హెచ్చరించారు. ఈ గ్యాంగ్ ఇప్పటికే రాష్ట్రంలో పలుచోట్ల సంచరిస్తూ దోపిడీలకు పాల్పడుతోందని తెలిపారు. ఎక్కడైనా నేరానికి పాల్పడే అవకాశం ఉందన్నారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనపడితే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు లేదా 100,112, 94407 96615 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇళ్లల్లో ఉన్న విలువైన ఆభరణాలు, డబ్బులు బ్యాంకులో దాచుకోవాలని సూచించారు.

కొత్త కనకరత్నమాలకు సేవారత్న సామ్రాట్ అవార్డు

ఆచంట : మండలంలోని భీమలాపురం గ్రామానికి చెందిన శ్రీదేవి ఆర్యవైశ్య సంఘం మహిళా మండల అధ్యక్షురాలు, డాక్టర్ కొత్త కనక రత్నమాల వెంకటేశ్వర్లకు స్వర్ణ హంస మెమెంటో, భారత సేవా రత్న సామ్రాట్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సరస్వతి పరిషత్ ట్రస్ట్ భవనం ప్రాంగణంలో ఆదర్శ కళా నిలయం ఆధ్వర్యంలో డాక్టర్ డివి.కృష్ణారావు, కుప్పం యూనివర్సిటీ ప్రొఫెసర్ డివివి.సరస్వతి, సంఘ ప్రెసిడెంట్, స్టార్ ఫిలిం డైరెక్టర్ యాక్టర్, రైటర్ సిహెచ్.ప్రకాష్ చేతుల మీదగా స్వర్ణ హంస మెమెంటోతోపాటు భారత సేవారత్న సామ్రాట్ అవార్డును అందుకున్నట్లు ఆమె విలేకరులకు తెలిపారు. 1983వ సంవత్సరం నుంచి 2025 సంవత్సరం వరకు అనేక సేవా కార్యక్రమాల ద్వారా అవార్డు లభించిందన్నారు. విద్యా, వైద్య, సాంస్కృతిక, యోగ, పర్యావరణ పరిరక్షణ తదితర సేవా కార్యక్రమం చేయటం ద్వారా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

నేటి నుంచి సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్

ఎంపిడిఒ బేబిశ్రీలక్ష్మి

గణపవరం : మండలంలో సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలు దశలవారీగా నిర్వహించటానికి గ్రామాల్లో అధికారులను నియమించినట్లు గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి ఆదివారం తెలిపారు. నియమించిన అధికారులు సోమవారం నుండి ప్రతి సచివాలయ పరిధిలో గల ప్రతి ఇంటికీ వెళ్లి జిఎస్‌టి ఉపయోగంపై వివరించాలని చెప్పారు. అదేవిధంగా కరపత్రాలు పంపిణీ చేయాలని, సచివాలయాల వద్ద బ్యానర్లు, సరుకులు ప్రదర్శనగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈనెల 29 నుండి అక్టోబరు 19 వరకు గ్రామంలో ర్యాలీలు, వర్క్‌షాపులు, ప్రదర్శనలు, విద్యార్థులకు వ్యాసరచనలు, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని చెప్పారు. జిఎస్‌టి తగ్గింపు వల్ల ప్రజలకు కలిగే లాభాలను విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు.

నేడు నరసాపురానికి కొవ్వలి రాక

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో అందుబాటులో ఉండనున్నారు. గతనెల 15న ఉద్యోగరీత్యా ఆయన అమెరికా వెళ్లారు. ఆదివారం రాత్రికి నరసాపురం చేరుకుంటారు. రెండు వారాలపాటు ఇక్కడే ఉండి అనేక శుభకార్యాల్లో పాల్గొంటారు. పార్టీ శ్రేణులతో సమావేశం అవుతారు. కూటమి ప్రభుత్వం ద్వారా నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారని నాయుడు వ్యక్తిగత కార్యదర్శి సంకు భాస్కర నాయుడు తెలిపారు. మరో వైపు అమెరికా నుండి కొవ్వలి నరసాపురం రావడంతో పార్టీ శ్రేణులు ఆయన ఇంటి వద్ద స్వాగతం చెప్పేందుకు పెద్ద ఎత్తున రెడీ అవుతున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి - మొగల్తూరు

1996-2001 వరకూ చదివిన పూర్వ విద్యార్థులు

మొగల్తూరులోని పెన్మత్స రంగరాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలిశారు. పాఠశాలలో 1996-2001 సంవత్సరంలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకూ చదివిన విద్యార్థులు కుటుంబ సమేతంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. వారు చదువుకున్న తరగతి గదిలోకి వెళ్లి అలనాటి జ్ఞాపకాలు గుర్తుతెచ్చుకున్నారు. ఆనాటి చదువులను అల్లర్లను గుర్తుచేసుకుని ఆనందంగా కుటుంబ సభ్యులతో గడిపారు. వారి కుటుంబ సభ్యులను మిత్రులకు పరిచయం చేశారు. ఆనాటి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రంగమన్నార్, హెచ్ఎం మేరీ ప్రసాదమ్మ, క్రాఫ్ట్ టీచర్ కిరణ్మయి, ఎంఎస్ఆర్‌కె.ప్రసాద్, పిఇటి వాసు, సత్యనారాయణ, పడాల భాస్కరరావు, ఉదయ భాస్కరరావు, నాగరాజు, కొల్లాటి బ్రహ్మయ్యలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్ సర్కారుకు తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు పాఠశాల ఆవరణలో ఆహ్లాదంగా గడిపారు. సహపంతి భోజనాలు చేశారు.

అపారిశుధ్య పరిస్థితి నివారించండి : సిపిఎం

వీరవాసరం : పెరికిపాలెం గ్రామంలో నెలకొన్న అపారిశుధ్య పరిస్థితులను నివారించాలని సిపిఎం శాఖ సమావేశం పంచాయతీ అధికారులను కోరింది. పెరికిపాలెం శాఖ సమావేశం ఆదివారం బొక్కా మంగారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గ్రామంలో గత కొంతకాలంగా నెలకొన్న సమస్యలను చర్చించారు. గ్రామంలో సక్రమమైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగుపారుదలకు ఆటంకంగా ఉందని సమావేశంలో చర్చించారు. ఈ పరిస్థితి వల్ల గ్రామంలో దోమలు విజృంభించి రోగాలకు కారణం అవుతుందని సమావేశంలో నిర్ధారించారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాలకే పరిమితమైన డ్రెయినేజీలలో మురుగునీరు పేరుకుపోవడం వల్ల అంటు రోగాలకు కారణం అవుతుందని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కలుషితానికి కారణం అవుతున్న రొయ్యల సాగు చెరువులపైన పూర్తిస్థాయిలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని సమావేశం కోరింది. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి బొర్రా అలమహారాజు, బొర్రా పద్మావతి, బొక్కా మహేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్

ప్రజాశక్తి - తణుకు

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు టిడిపి కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అమరవీరుల భవనంలో జరిగిన విస్తృత సమావేశం పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల రద్దు చేసి టిడిపి కూటమి ఎన్నికల్లో చెప్పిన విధంగా పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇవ్వాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ప్రభుత్వం ఇవ్వాలని అన్నారు. ఇటీవల వర్షాల వల్ల పాడైపోయిన రోడ్లు, గుంతలు వెంటనే వేయాలని అన్నారు. తణుకు పట్టణంలో టిడిపి ప్రభుత్వం ఇచ్చిన టిడ్కో ఇళ్లు వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని అన్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఒపి ఆన్‌లైన్‌లో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని, ఆసుపత్రిలోనే స్కానింగ్ తీసేవిధంగా, అన్నిరకాల వైద్యులను, సిబ్బందిని నియమించాలని, ఇఎస్ఐ 30 పడకల ఆసుపత్రి నిర్మాణం చేయాలని, కరోనా ముందు ఉన్న సమయాలు అమలు చేయాలని అన్నారు. ఒక పక్కన పెన్షన్లు పెంచామని చెబుతూ, మరో పక్క ఇప్పటి వరకు అర్హత ఉన్న వారు ఇప్పుడు కాదని చెప్పడం అన్యాయమన్నారు. రీ వెరిఫికేషన్ పేరుతో పర్సెంటేజ్ తగ్గించారని అన్నారు. గోస్తనీ నదిలో కాలుష్యం వెదజల్లుతున్న వారిపై చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకుంటే సిపిఎం ప్రజల పక్షాన ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కామన మునిస్వామి, బళ్ల చినవీరభద్రరావు, గార రంగారావు, కె.నాగరత్నం, గంగాధరరెడ్డి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - యలమంచిలి

బహుమతులు అందుకున్న విజేతలు

లవ్ పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి వేమన పద్యాల పోటీలలో విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం చిల్డ్రన్స్ హోమ్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి లవ్ పీపుల్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కవి కోలాటి పెద్దిరాజు, ఉపాధ్యాయులు కొల్లాబత్తుల సూర్య కుమార్, మైనారిటీ నాయకులు మహమ్మద్ జానీ విచ్చేశారు. వక్తలు మాట్లాడుతూ లవ్ పీపుల్ ఫౌండేషన్ తరపున డాక్టర్ ప్రేమ్ తెలుగు సాహిత్యం పట్ల చేస్తున్న కృషిని కొనియాడారు. సొంత కష్టార్జితంతో ఎవరి నుంచి ఒక్క రూపాయి కూడా ఆశించకుండా చేస్తున్న ఇలాంటి గొప్ప సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమన్నారు. 784 మంది పాల్గొన్న పోటీలో మొదటి 20 స్థానాలకు బహుమతులు అందించారు. ప్రథమ బహుమతి అందుకున్న చివటం సుబ్బారావు(పెనుగుండ) రూ.5 వేలు నగదు, షీల్డ్, సర్టిఫికెట్ ఇచ్చి సాలువా పూలమాలతో సత్కరించారు. ద్వితీయ బహుమతి బండి గణేష్(భీమలాపురం) రూ.2,500, షీల్డ్, సర్టిఫికెట్, తృతీయ బహుమతి దామర్ల నాగమణి(హైదరాబాద్) రూ.1500 షీల్డ్, సర్టిఫికెట్ ఇచ్చి సత్కరించారు. కన్సొలేషన్ వచ్చిన మండెల శ్రీను(పాలకొల్లు), రోషన్ సాత్విక్(హైదరాబాద్), ఎమ్.రిత్విక(శ్రీకాకుళం)లకు షీల్డ్, సర్టిఫికెట్ ఇచ్చి సత్కరించారు. మిగిలిన 14 మంది శ్రీవాస్తవ్(మొయినాబాద్ - రంగారెడ్డి), పాతగొలుసు ధన్విక(మినిమించిలిపాడు), సూరిబాబు(శివదేవుని చిక్కాల), కీర్తి(కొంతేరు), వనం హర్షిత(చింతలగరువు), లక్కోజు హృషికేష్(హైదరాబాద్), జి.మహాలక్ష్మి(ములపర్రు), లాస్య శ్రీవల్లి(భీమలాపురం), తూము లాస్రీత(గుమ్ములూరు), పి.పావని(నెల్లూరు), సిహెచ్.భాగ్యశ్రీ (పాలకొల్లు), ఎమ్.లక్ష్మి ప్రసన్న(కర్ణాటక), సూర్య సంఘర్ష(హైదరాబాద్), విజయరాణి (జోగులమ్మా గద్వాల్ జిల్లా)లకు సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమం లో న్యాయమూర్తులుగా వ్యవహరించిన కోలాటి పెద్దిరాజు, కొల్లా బత్తుల సూర్యకుమార్‌ను ఎల్‌పిఎఫ్ సభ్యులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. సభ్యులు మరియు పిల్లలు కలసి ఎల్‌పిఎఫ్ ఛైర్మన్ డాక్టర్ ఉన్నమట్ల ప్రేమ్ కుమార్‌ని శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో రావి హరీష్ బాబు, అంబటి ఏసు, గూటం భారత్ చంద్, వర్ధనపు శ్రీనివాస్, గెద్దాడ సంజీవ్, కనపాల దాసు, తెన్నేటి బాలు, కుప్పల రాజు, కండవల్లి జ్యోతి, ప్రసాద్, కౌశిక్ పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతే మానవత

రిటైర్డ్ అధ్యాపకులు కొత్త సత్యనారాయణ మూర్తి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సామాజిక బాధ్యత కలిగి ఉండడమే మానవతని, పర్యావరణం పట్ల అందరూ శ్రద్ధ తీసుకోవాలని జిల్లా మానవతా కమిటీ కన్వీనర్, విశ్రాంత అధ్యాపకులు కొత్త సత్యనారాయణ మూర్తి అన్నారు. ఆదివారం మానవతా మండల శాఖ ఆధ్వర్యంలో మార్టేరు మానవతా కార్యాలయం లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి మరో ముఖ్యఅతిథి రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, ఉండి గ్రామ మానవతా సంస్థ ఫౌండర్ రుద్రరాజు యువరాజులకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా భూపతిరాజు రవీంద్ర రాజు మాట్లాడుతూ ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాలు చేస్తూ భగత్ సింగ్ జయంతి వేడుక చేశారు. ఆయన త్యాగం, ధైర్యం అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, సమసమాజ నిర్మాణానికి యువత ముందుకు రావాలని అన్నారు. మరో ముఖ్య అతిథి రుద్రరాజు యువరాజు, అధ్యక్షులు శిరం విశ్వనాథం, ఛైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం మాట్లాడారు. ఆత్మీయ కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాస్ రెడ్డి, సెక్రెటరీ బండి ప్రసాద్, చదువులు వెంకట నరేంద్ర, పడాల జగన్నాథ్ రెడ్డి, కోనాల నర్సిరెడ్డి, కడలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శరవేగంగా ఆర్‌ఒబి నిర్మాణ పనులు

ఉండి: ఉండి రైల్వే గేట్ మీద నిర్మించే ఆర్‌ఒబి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నిర్మాణ పనులను వేగవంతం చేశారు. ఆర్‌ఒబి నిర్మాణ పనులలో భాగంగా ఆదివారం రైల్వే గేటు వద్ద ఫిల్లర్ నిర్మించడానికి పనులను ప్రారంభించారు. గత కొద్దిరోజులుగా రాత్రి, పగలు తేడా లేకుండా ఆర్‌ఒబి పనులు చేయడంతో త్వరలోనే ఆర్‌ఒబి అందుబాటులోకి వస్తుందని ప్రజలు, వాహన చోదకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పెదపుల్లేరు రహదారి రైల్వే గేటు వద్ద ఉన్న ఫిల్లర్లపై గడ్డర్లు బిగించగా విజయదశమి అనంతరం కొద్ది రోజులు ఉండి రైల్వే గేటును మూసివేసి ఫిల్లర్ పనులను తొందరగా పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆర్‌ఒబి నిర్మాణ ప్రతినిధులు తెలిపారు.

వైసిపి డిజిటల్ బుక్ ప్రారంభం

తణుకు : సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని అంటున్న వైసిపి శ్రేణులు, ప్రజలపై టిడిపి కూటమి నాయకులు చేస్తున్న దాడులు, హత్యలు, ఎదుర్కొనేందుకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి క్యూ ఆర్ కోడ్‌తో ఉన్న డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారని మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. అనంతరం క్యూఆర్ కోడ్‌తో ఉన్న డిజిటల్ బుక్‌ను ప్రారంభించారు. పట్టణ అధ్యక్షులు మారిశెట్టి శేషగిరి, పంచాయితీ రాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎండి హబీబుద్దీన్, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ యిండుగపల్లి బలరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి పేటలో రోడ్ల మరమ్మతులు

ఉండి :మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం పంచాయతీ పరిధిలోని ఎస్‌సి పేటలో ఇటీవల కురిసిన వర్షాలకు పాడైపోయిన రహదారులకు గ్రామ సర్పంచి సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు మరమ్మతులు చేయించారు. వర్షాల కారణంగా పలుచోట్ల రహదారులు బురదమయంగా మారి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచి దృష్టికి వచ్చింది. దీనిపై తక్షణమే స్పందించిన ఆమె ఇబ్బందిగా ఉన్న ప్రదేశాలలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఈ చర్యతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని సర్పంచి తెలిపారు.

కాళ్లలో..

పలుచోట్ల శరన్నవరాత్రి మహోత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం నిర్వహించారు. 7వ రోజు అమ్మవారు ఐశ్వర్యలక్ష్మి అలంకరణ నిర్వహించారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన అడ్డాల నరేంద్ర వర్మ-ప్రసన్న దంపతులచే అమ్మవారికి సహస్రనామ కుంకుమ పూజ, అష్టోత్తర శత నామ పూజ, నీరాజన మంత్రపుష్పము ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున యాత్రికులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కరగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో సందడి నెలకొంది. ఆలయ కార్య నిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేశారు.

నరసాపురం : మండలంలోని సరిపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఏడవ రోజు ఆదివారం అమ్మవారిని రూ.6.50 లక్షల విలువైన 100,200 కరెన్సీ నోట్లతో అద్భుతంగా అలంకరించారు.

పాలకొల్లు : విజయదశమి ఉత్సవాల సందర్భంగా పాలకొల్లు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో రూ.కోటితో ధనలక్ష్మి అమ్మవారి అలంకరణ చేశారు. భక్తులు తండోపతండాలుగా ఈ అలంకరణ చూడ్డానికి వస్తున్నారు.

పబ్లిక్ ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, దేవాదాయ ధర్మదాయ శాఖ, ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, చేబ్రోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ రుక్మిణీ సమేత పాండురంగస్వామి దేవస్థానము, చేబ్రోలు, ఆంధ్రప్రదేశ్ ఛారిటబుల్ మరియు హిందూ రెలిజియన్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎండోమెంట్ చట్టం సెక్షన్ 30/1987 ప్రకారం ప్రచురణ, రిజిస్ట్రేషన్ చేయుట కొరకు ప్రతిపాదించడమైనది. కావున సదరు సంస్థను ఆంధ్రప్రదేశ్ ఛారిటబుల్ మరియు హిందూ రెలిజియన్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎండోమెంట్ చట్ట ప్రకారం ప్రచురణ మరియు రిజిస్ట్రేషన్ చేయుటలో ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన తేదికి 10 రోజులలో లిఖిత పూర్వకముగా శ్రీయుత జిల్లా ఎండోమెంట్స్ అధికారి, దేవదాయ ధర్మదాయ శాఖ ఏలూరు వారి కార్యాలయం వారికి తెలుపగలరని తెలియజేయడమైనది.

సం/- ఛైర్మన్
శ్రీ రుక్మిణీ సమేత పాండురంగస్వామి దేవస్థానము
చేబ్రోలు

చేబ్రోలు
ది. 28-09-2025